

బడిబాట నిర్వహిస్తున్న ఎంఈవో, హెచ్ఎం, విద్యార్థులు

## బిలాల్‌పూర్‌లో బడిబాట

కోహీర్, ఏప్రిల్ 21: మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో సోమవారం ముందస్తు బడిబాటను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే తొమ్మిది మంది విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరారు. ప్రభుత్వ బడులు ఉండగా..ప్రైవేటు పాఠశాలలు దండగా అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వ బడి అందించే ఉచిత విద్యాభ్యాసంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో జాకీర్‌హుస్సేన్, హెచ్ఎం సురేశ్, అండాలు, నిర్మల, మృదుల, సింహాచలం, వినోద, సునీత, సుల్తానా, ఆసియా, తదితరులున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మనూరు, ఏప్రిల్ 21:విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో బడిబాటలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కరప్రతాలు పంచుతూ తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతోపాటు, యునిఫాం, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు కూడా అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు నందలి రాజ్‌కుమార్, ప్రసన్న కుమార్, మచ్చేందర్, రవికుమార్, విఠల్ పాల్గొన్నారు.

## బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

కోహీర్, ఏప్రిల్ 21: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోమవారం మండలంలోని కవేలి గ్రామంలో సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిచయం లేని వ్యక్తులకు ఫోన్లు ఇవ్వొద్దని సూచించారు. లక్షలాది రూపాయలు గెలుచుకున్నారు. వెంటనే ఓటీపీ చెప్పాలని ఎవరైనా ఫోన్ చేసినా స్పందించొద్దన్నారు. బెట్టింగ్‌లతో యువత జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొగులయ్య, రాచన్న, రాజ్‌కుమార్, మల్లేశం, ఫయాజ్, తదితరులున్నారు.



ఉద్యమ నేత శశిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## ఉద్యమ నేతను పరామర్శించిన ఎమ్మెల్యే

జహీరాబాద్, ఏప్రిల్ 21: అనారోగ్యంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటున్న ఉద్యమ నేత శశిని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పరామర్శించారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాస గృహంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, యాకూబ్, మోహీజొద్దీన్, తులసీదాస్ గుప్తా, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

## ఔదార్యం చాటిన మిత్రులు

జిన్నారం, ఏప్రిల్ 21: జిన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన గుర్రాల నరేశ్‌యాదవ్ ఇటీవల అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. 2003 -04 జిన్నారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి మిత్రులు నరేశ్‌యాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం స్నేహితుడి చిత్రపటానికి నివాళులర్పించారు. బాధలో ఉన్న మిత్రుడి కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సహాయాన్ని అందించారు. స్నేహితుడి భార్య, బిడ్డలకు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, తోటి మిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కృష్ణానంద ఆశ్రమంలో రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు

## కృష్ణానంద ఆశ్రమంలో రుద్రాభిషేకాలు

గుమ్మడిదల, ఏప్రిల్ 21: మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణానంద ఆశ్రమంలో రాంపూర్ పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతి పర్యవేక్షణలో సోమవారం భక్తులు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు మాట్లాడుతూ భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో ఉండేవిధంగా ప్రతిరోజు దైవ నామస్మరణ చేయాలని సూచించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

## అర్హుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

జహీరాబాద్, ఏప్రిల్ 21: ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల అధికారులు అన్నారు. సోమవారం ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన సర్వేలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో కలిసి సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇండ్ల నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. సమావేశాల్లో అధికారులు మహేందర్‌రెడ్డి, రాజశేఖర్, మహేశ్, రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు ఉన్నారు.

# భూభారతిపై అవగాహన పెంపొందించుకోవాలి

## కలెక్టర్ వల్లూరు క్రాంతి



మొగుడంపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

జహీరాబాద్, ఏప్రిల్ 21: భూసమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూభారతిపై రైతులు పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం జహీరాబాద్, మొగుడంపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై భూభారతి ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాల గురించి అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూసమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈనెల 14న భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాదిలోగా భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. సమస్యలు పరిష్కారం కాని రైతులు కలెక్టర్ లేదా సీసీఎల్ఏకు అప్పీల్ చేసుకోవచ్చాన్నారు. ఈ చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ధరణిలో రెవెన్యూ కోర్టులు తొలగించడం వల్ల భూవివాదాలు విషయంలో రైతులు సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం రెవెన్యూ కోర్టులను పునరుద్ధరించిదన్నారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్‌కు అధికారాలు కల్పించిందన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాల్లో రికార్డు డిస్ప్లే చేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు గ్రామ పరిపాలన అధికారులను నియమిస్తారన్నారు. ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు భూభారతిలో కొనసాగుతాయన్నారు. అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ భూభారతిపై ఏవైనా సందేహాలుంటే వాటిని పరిష్కరించడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. సదస్సులో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ఆర్డీవో రాంరెడ్డి, తహసీల్దార్లు దశరథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జింక గోపాల్

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకుడు

గుమ్మడిదల, ఏప్రిల్ 21: కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన జింక గోపాల్ ముదిరాజ్ బీఆర్ఎస్‌లో చేరారు. గతంలో కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే జింక గోపాల్, పార్టీలో అభివృద్ధి లేకపోవడం, కార్యకర్తలకు ప్రాధాన్యత లేకపోవడం వంటి కారణాలతో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. సోమవారం బీఆర్ఎస్ పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు బీఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు. రాజకీయాల్లో తనకున్న అనుభవాన్ని బీఆర్ఎస్ అభివృద్ధికి వినియోగిస్తానని గోపాల్ తెలిపారు. బీఆర్ఎస్ నాయకత్వం తనను ఆదరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రజావాణికి 63 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 21: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి వారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 63 అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు ఫిర్యాదులను అధికారులకు అందజేసి వాటిని సకాలంలో పరిష్కరించాల ఆఅరు. ఆయా అర్జీలను స్వీకరించిన అదనపు చంద్రశేఖర్ వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షల్లో 10 మంది డీబార్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 21: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశంపొందిన అభ్యాసకులకు సోమవారం రెండోరోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. పటాన్‌చెరు, ఆర్సీపురం కేంద్రాల్లో మాల్ ప్రాక్టీసింగ్‌కు పాల్పడుతూ 10 మంది అభ్యాసకులు డీబారయ్యారు. రాష్ట్రస్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీల్లో 10 మంది మాల్ ప్రాక్టీసింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారు. ఓపెన్ స్కూల్ పదో తరగతికి సంబంధించి ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో ఉదయం జరిగిన ఆంగ్లం పరీక్షకు 2075 మంది అభ్యాసకులకు, 1894 మంది హాజరయ్యారు. 181 మంది గైర్హాజరయ్యారు. దీంతో 91శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన ఐసీహెచ్ పరీక్షకు 61 మందికి 50 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేసిన 15 కేంద్రాల్లో ఉదయం జరిగిన ఆంగ్లం పరీక్షకు 3762 మంది అభ్యాసకులకు 3400 మంది హాజరయ్యారు. 262 మంది గైర్హాజరయ్యారు. దీంతో 93శాతం హాజరు నమోదైంది. ఆయా పరీక్షా కేంద్రాలను రాష్ట్రస్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో పాటు, డీఈవో, పరీక్షల కమిటీ పర్యవేక్షించింది.



విద్యార్థులతో విజయకేతనం చూపుతున్న యాజమాన్యం

## బీఎస్సీ పారామెడికల్ కోర్సుతో ఉజ్వల భవిష్యత్తు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 21: బీఎస్సీ పారామెడికల్ కోర్సుతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్ఫూర్తి డిగ్రీ కళాశాల యాజమాన్యం ధారాసింగ్, డాక్టర్ రాజుగౌడ్ పేర్కొన్నారు. సోమవారం బీఎస్సీ వొకేషనల్, పారామెడికల్ కోర్సుల ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాల్లో స్ఫూర్తి డిగ్రీ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ధారాసింగ్, డాక్టర్ రాజుగౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్సీ పారామెడికల్ కోర్సుతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ సుమతి, కోఆర్డినేటర్ గీతాంజలి, అధ్యాపకులు పాల్గొన్నారు.



జేఎన్టీయూ వద్ద నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

## జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

చౌటకూర్, ఏప్రిల్ 21: మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సమ్మె చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు సోమవారం జేఎన్టీయూ వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో 1,445 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బోధన చేస్తున్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొంతకాలంగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు సమ్మెకు దిగడంతో తరగతులు జరగక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. యూనివర్సిటీలో ఖాళీలు భర్తీ చేయకపోవడం, పొఫెసర్లను నియమించకపోవడంతో విద్యార్థులు మండిపడ్డారు.

## అర్హులకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 21: సిబిల్‌స్కోర్‌తో సంబంధం లేకుండా అర్హులకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా పథకాన్ని అందించాలన్నారు. నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో అనూహ్య స్పందన వచ్చిందన్నారు. రూ.50వేల నుంచి రూ. 4లక్షల వరకు రుణం పొందడానికి జిల్లాలో 51,657 మంది దరఖాస్తులు సమర్పించారన్నారు. అత్యధికంగా బీసీ వర్గాల నుంచి 6,546 యూనిట్లకు 23,681 దరఖాస్తులు, ఎస్సీ విభాగంలో 7,415 యూనిట్లకు 14,480, మైనార్టీ విభాగంలో 2,456 యూనిట్లకు 8,378, ఎస్టీ విభాగంలో 2,502 యూనిట్లకు 4,232, ఈబీసీలో 1,654 యూనిట్లకు 817 దరఖాస్తులు సమర్పించారని వివరించారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా యూనిట్లను మంజూరు చేసి వారికి ఉత్తర్వులు అందజేయనున్న వెల్లడించారు. పథకంలో తొలుత నిస్సాహాయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నిరుద్యోగులు, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్వయం ఉపాధి పథకాల రుణాలు పొందని వారికి ప్రాధాన్యతా క్రమంలో మంజూరు చేయనున్నదని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఏ పీడీ జ్యోతి, ఈడీఎస్సీ కార్పొరేషన్ రామాచారి, వివిధ సంక్షేమ శాఖల అధికారులు అఖిలేశ్ రెడ్డి, జగదీశ్, దేవుజా, ఎల్డీఎం గోపాల్‌రెడ్డి, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

జిన్నారం, ఏప్రిల్ 21: సవాళ్లను ఎదురుకొంటూ, ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు అడుగు వేయాలని ఇంపాక్ట్ వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాజేశ్వర్ అన్నారు. సోమవారం జిన్నారం మండలకేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన చెలిమి కార్యక్రమంలో భాగంగా సామాజిక భావోద్వేగ సంక్షేమం అవగాహన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డిజిటల్ క్లాసులతో వీడియో రూపంలో విద్యార్థులకు వ్యక్తి వికాస అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ నాగలక్ష్మి మాట్లాడుతూ... మాదకద్రవ్యాలకు విద్యార్థులు, నేటి యువత దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత కేవలం ఉద్యోగులుగా మిగిలిపోకుండా, ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పెయింటర్ ఉదయ్ పెయింటింగ్ రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటయ్య, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

### భార్యతో గొడవపడి

## భర్త ఆత్మహత్య

జిన్నారం, ఏప్రిల్ 21: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డపోతారం మున్సిపాలిటీ కాజీపల్లి జీఎంఆర్ కాలనీలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... దండుగుల కుర్మయ్య(39) భార్య ఎల్లమ్మతో కలిసి కాలనీలో ఉంటున్నాడు. మద్యానికి బానిసై భార్యతో తరుచూ గొడవకు దిగేవాడు. ఈనెల 20న మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో భార్యతో గొడవపడి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కాజిపల్లి గ్రామ శివారులోని అడవి మైసమ్మ గుడి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఈదురుగాలుల బీభత్సం

హత్నూర, ఏప్రిల్ 21: మండలకేంద్రమైన హత్నూరలో సోమవారం సాయంత్రం భారీఎత్తున ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. హత్నూర గురుకుల కళాశాల, పాఠశాల ఆవరణలో ఈదురుగాలులకు విద్యుత్‌స్తంభాలు నేలకొరగడంతోపాటు చెట్లు విరిగిపోయాయి. విద్యుత్‌స్తంభాలు విరిగిపోవడంతో రెండుగంటలపాటు కరెంటు సరఫరా నిలిచి ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు.

### డంపింగ్‌యార్డు అనుమతులు

## ఉపసంహరించుకోవాలి

గుమ్మడిదల, ఏప్రిల్ 17: ప్యారానగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వంలో చలనం రావటంలేదని జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 76వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ నల్లవల్లి, కొత్తపల్లి సమీపంలోని గ్రామాల రైతులు వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్నారన్నారు. డంపింగ్ యార్డు వల్ల భూగర్భజలాలు, పర్యావరణ కాలుష్యమయంగా మారుతుందన్నారు. తద్వారా రైతులు పంటలు పండించలేరన్నారు. డంపింగ్ యార్డు వ్యర్థాల వల్ల అడవితోపాటు వానల వల్ల దిగువ ప్రాంతమైన నర్సాపూర్ రాయచెరువు పూర్తిగా కాలుష్యంగా మారుతుందన్నారు. దీనికి గొలుసుకట్టుగా ఉన్న 20 గ్రామాల్లోని చెరువులు కూడా కలుషితమై ప్రజాజీవనానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఇక్కడి గ్రామాల ప్రజలు సంతోషంగా ఉండాలంటే రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల జేఏసీ నాయకులు కుమ్మరి ఆంజనేయులు, మన్నె రామకృష్ణ, కొరివి సురేశ్, మహిళా జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## క్వారీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జిన్నారం, ఏప్రిల్ 21: జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం శివారులో క్వారీల విచ్చలవిడి బ్లాస్టింగ్‌లతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాదారం పోరాట కమిటీ జేఏసీ అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్వారీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 210 సర్వే నెంబర్‌లోని అసైన్డ్ భూముల్లో క్వారీల విచ్చలవిడి బ్లాస్టింగ్లతో దుమ్ము ధూళితో బోరు బావులు ధ్వంసం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాస్టింగులతో ఇళ్లులు బీటలు పడడంతో పాటు ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తామని వారు తెలిపారు. జిన్నారం తాసీల్దార్ భిక్షపతికి సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రధానకార్యదర్శి రమణసింగ్, ప్రతినిధులు సాయికుమార్ అనిల్‌కుమార్, శేఖర్, విక్కీ సింగ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్‌ను కలిసిన పెద్ద చెరువు ముంపు బాధితులు

అమీన్‌పూర్ ఏప్రిల్ 21: అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి పెద్దచెరువు సమస్యను వివరించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ ఐఐటీ డైరెక్టర్, ఎన్‌ఆర్ఎస్ఏ డైరెక్టర్, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్లతో కలసి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంజయ్ కుమార్, టీవీరావు, జీవ, నాగభూషణరావు, సత్యనారాయణ, రామకృష్ణ, రంగరాజు, రవీందర్, కృష్ణ ఉన్నారు.

## తాగునీరు రావటం లేదని ప్రజావాణిలో ఫిర్యాదు




కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 21: ముత్తంగిలో 45 రోజులుగా తాగునీరు రావడం లేదని గ్రామ బీఆర్ఎస్ నాయకులు కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి నుంచి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెరాజ్‌ఖాన్, గ్రామాధ్యక్షుడు రామకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో తాగునీటిని అందజేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో 25వేల జనాభా ఉందని తెలిపారు. 45 రోజులుగా తాగునీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు అందించడంలో మిషన్ భగీరథ అధికారులు విఫలం చెందారని ఆరోపించారు. జాతీయ రహదారి విస్తరణ కాంట్రాక్టర్ తాగునీటి పైప్‌లైన్‌ను పగలగొట్టాడని చెబుతూ నీటి సరఫరాను నిలిపివేశారని అదనపు కలెక్టర్‌కు వివరించారు. ముత్తంగిలో భూగర్భజలాలు కలుషితమయ్యాయని గుర్తుచేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ ట్యాంకర్లతో ప్రజలకు నీటిని సరఫరా చేయాల్సి ఉన్నా, ఒక్క ట్యాంకర్ నీటిని కూడా సరఫరా చేయలేదని ఫిర్యాదు చేశారు. అధికారులను తాగునీటిని అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో సాయి ప్రసాద్, సాయిరాంగౌడ్, బాల్‌రాజ్, సురేశ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ 65 విస్తరణ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి




తహసీల్దార్ రంగారావుకు వినతిపత్రం అందజేస్తున్న రుద్రారం గ్రామస్తులు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 21: జాతీయ రహదారి విస్తరణ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వర్‌రావు కోరారు. సోమవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలో జాతీయ రహదారి 65 విస్తరణలో ఇండ్లు, ఆస్తులు, భూములు కోల్పోతున్న నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ రంగారావుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ మియాపూర్ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు రూ.1350కోట్ల ఖర్చుతో చేస్తున్నారన్నారు. వాటిలో రూ.700 కోట్లు రహదారి నిర్మాణానికి, రూ.650కోట్లు భూములు, ఇండ్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించేందుకు నేషనల్ హైవే సంస్థ కేటాయించిందన్నారు. కానీ రుద్రారం, ముత్తంగి గ్రామాల్లో విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నా నష్టపోయిన ప్రజలకు రూపాయి కూడా నష్టపరిహారంగా ఇవ్వలేదని ఆరోపించారు. నష్టపరిహారం ఎవరు ఇస్తారో, ఏ అధికారిని అడగాలో తెలియని ఆయోమయ పరిస్థితి నెలకొన్నదన్నారు. కేవలం కాంట్రాక్టు సంస్థ సిబ్బంది మాత్రమే తమపని తాము చేసుకుంటు వెళ్తున్నారన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని ఇండ్లు, భూములు కోల్పోతున్నవారికి నష్టపరిహారం చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు రవీందర్, రాములు, మహేందర్‌రెడ్డి, విజయభాస్కర్, కుమ్మరి చంద్రయ్య, అంజిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, అనంతయ్య పాల్గొన్నారు.



సంగారెడ్డిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

సంగారెడ్డి, ఏప్రిల్ 21: ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఎమ్మెల్యే ప్రభాకర్ కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, నాయకులు జైపాల్‌రెడ్డి, హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ నాయకులు, కంది మండల బీఆర్ఎస్ నాయకులు హాజరై ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తనపై అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ప్రజల ఆధారాభిమానాలు తనకు ఎల్లవేళలా ఉంటాయని, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపక ముగింపు వేడుకలో భెల్ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది

## ముగిసిన అగ్నిమాపక ముగింపు వారోత్సవాలు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 21: బీడీఎల్ పరిశ్రమలో నేషనల్ ఫైర్ సర్వీస్ డే వారోత్సవాలు ముగిశాయి. సోమవారం బీడీఎల్‌లో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమాండెట్ అర్షద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో నేషనల్ ఫైర్ సర్వీస్ డే వారోత్సవాలను వారం రోజులపాటు నిర్వహించారు. చివరి రోజు అగ్ని ప్రమాదాలను కృత్రిమంగా నిర్వహించి ఫైర్ ఫైటింగ్ బృందం ధైర్య సాహసాలతో మంటలను ఆర్పివేశారు. పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలు, ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీతో వచ్చిన మంటలను ఆర్పడం, పరిశ్రమల్లో ఏర్పడే అగ్ని ప్రమాదాలను నిలువరించి సిబ్బంది కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీడీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషన్ లునవత్, ఏజీఎం విప్లవ్ సిన్హా మాట్లాడారు. కార్యక్రమంలో బీడీఎల్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

**భెల్ పరిశ్రమలో...**

రామచంద్రాపురం, ఏప్రిల్ 21: భెల్ పరిశ్రమలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం ముగింపు వేడుకలు నిర్వహించారు. భద్రతా ఇంజినీరింగ్ సమన్వయంతో సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక విభాగం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీ లు నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది అగ్నిమాపక ప్రదర్శనలు చేశారు. భెల్ అగ్నిమాపక కేంద్రంలో భెల్ ఉద్యోగులతో పాటు సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భెల్ జీఎం విజయ్‌సాగర్ మాట్లాడుతూ పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటు చేసుకునప్పుడు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేయడంలో కీలకంగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ మంజీత్‌కుమార్, ఎస్‌డిజీఎం అరవింద్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ భండారి పాల్గొన్నారు.

**డాక్యుమెంట్ పోయినది**

మొహమ్మద్ అలీం, తండ్రి: ఎం.ఎ. సలీం, నివాసం: 1-1-55, రహమాన్ కాలనీ, నారాయణఖేడ్ మండలం, సంగారెడ్డి జిల్లా, ఆధార్ నెం: 8125 5365 3595కు చెందిన నివాసిని. తేది: 15-03-2025 రోజున నేను సంగారెడ్డి నుండి నారాయణఖేడ్ బస్సులో ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో నారాయణఖేడ్ మంగల్‌పేట్ బస్టాండ్ వద్ద ప్లాట్ నెం. 62, Sy.No.64/ఈ, ext. 107-91 Sq.yards నారాయణఖేడ్ వద్ద గల Original Regd. Sale Deed Document No. 69/2004, Date: 21-01-2004 పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. నాకు ఈ ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ ఉపయోగం నిమిత్తం, ఈ ఆర్.సి. అవసరం కలదు. ఎవరికైనా దొరికిన చో సంప్రదించండి:

**Cell: 7660974251**